# హైదరాబాద్ వార్త



## అప్రకటిత విద్యుత్తు కోతలు

- తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం
- విద్యార్థులకు, వర్క్‌ఫ్రం హోం చేసే వారికి ఇబ్బందులు



హైదరాబాద్,ఏప్రిల్ 17 ప్రభాతవార్త : గ్రేటర్, శివారు ప్రాంతాలలో అప్రకటిత విద్యుత్తు కోతలతో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం, 5-10 నిమిషాల అనంతరం సరఫరా అవుతోంది. ఇలా తరచూ జరుగుతుండడంతో సమీపిస్తున్న పరీక్షలతో విద్యార్థులకు, వర్క్‌ఫ్రం హోం చేస్తున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సిస్టం రిస్టార్ట్ కావడంతో చేసే పనికి ఆటంకం కలుగుతోంది. అదే సమయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు చదువుకునే సమయంలో ఇంటర్నెట్ సరఫరా నిలిచిపోతోంది. తరచూ విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం వల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకుగురవుతున్నారు. సమస్య విద్యుత్తు సరఫరా అంతరాయం అనేది తమ ప్రాంతంలో సర్వసాధారణంగా ఉంటోందని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత శాఖా అధికారులు కొన్ని ప్రాంతాలలో అధికారికంగానే ప్రకటించి మరమ్మత్తులు చేస్తున్నా.. చాలా చోట్ల అకస్మాత్తుగా విద్యుత్తు సరఫరా చాలా సేపు నిలిచిపోయి మళ్లీ వస్తోందని పలువురు వాపోతున్నారు. అసలే వేసవికాలం, ఆపై తరచూ అప్రకటిత విద్యుత్తు కోతలు, దీంతో గ్రేటర్ పరిధిలో ప్రజలు, శివారు ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంట్లో ఉండే పెద్దవారు వర్క్‌ఫ్రం హోం చేస్తుండగా, ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నవారికి అకస్మాత్తుగా విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. చాలా ప్రాంతాలలో ఈ విధంగా విద్యుత్తు సరఫరా అంతరాయాలు ఏర్పడడం వల్ల వారి ఇంట్లో ఇన్వర్టర్లు లేకపోవడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయినప్పుడల్లా చేసే పనులు ఆగిపోతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇంట్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ కోసం వాడే రూటర్‌కు, బ్యాటరీ బ్యాకప్ లేని కంప్యూటర్లకు తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం పెద్దసమస్యగా మారింది. ఇప్పటికే ప్రతి ఇంట్లో డెస్క్‌టాప్, లాప్‌ట్యాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్‌లు తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సి వచ్చింది. అదే సమయంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం వల్ల ఇన్వర్లర్లు కొనుగోలు చేయాల్సివస్తోందని ప్రజలు వాపోతున్నారు. కోతల్లేకుండా 24 గంటలపాటు విద్యుత్తు సరఫరా చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా, వాస్తవంగా తరచూ విద్యుత్తు కోతలు విధిస్తూనే ఉన్నారు.అప్రకటిత విద్యుత్తు కోతలపై ఉప్పల్, బోడుప్పల్‌కు చెందిన కొందరు విద్యుత్తు శాఖాధికారులను సంప్రదిస్తే లోడ్ రిలీఫ్ కోసం ఐదుపది నిమిషాల పాటు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తుంటామని సమాధానం ఇస్తున్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ పేరుతో ముందస్తుగానే మరమ్మతులు చేయాల్సిన విద్యుత్తు శాఖ అధికారులు నేటికి కొనసాగిస్తున్నారు. చెట్ల కొమ్మలు నరికి వాటిని తొలగించకుండా రోడ్లపై వేసి వెళ్లిపోతున్నారు. ఇటీవల కురుస్తున్న చిరు జల్లులు వచ్చినప్పుడు వాటితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాగా గ్రేటర్ పరిధిలో నిరంతరం విద్యుత్తు సరఫరా కోసం అవసరమైన చోట మరమ్మతులను విద్యుత్తు శాఖ అధికారులు చేపడుతున్నారు. ముఖ్యంగా విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను, వాటి కొమ్మలను తొలగించడం, అవసరమైనచోట పాత స్తంభాలను మార్చడం, కేబుల్స్‌ను మార్చుతుంటారు. సబ్‌స్టేషన్స్‌లోని ట్రాన్స్‌ఫార్మర్స్‌లో ఆయిల్‌మార్చడం, ప్రాంతాలవారీగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మత్తులు, ఇలా రకరకాల పనులు నిర్వహించేందుకు ఒక రోజు ముందుగానే ఆయా సర్కిళ్లు, సబ్‌స్టేషన్, ఫీడర్‌ల వారీగా విద్యుత్తు సరఫరాను నిర్ణీత సమయాల్లో నిలిపివేసి పనులు పూర్తి చేస్తుంటారు.

## ఒయూలో బోధన, బోధనేతర సిబ్బందికి ఇఫ్తార్ విందు ఇచ్చిన వైస్ చాన్స్‌లర్

తార్నాక, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ప్రతి ఒక్కరు అల్లాహ్ ఆశీస్సులు పొందాలని విసి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముస్లీం ఉద్యోగులు వైస్ చాన్స్‌లర్‌కు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ, యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొ.మల్లేశం, పాలక వర్గ సభ్యులు ప్రొ.తలత్ సుల్తానా, ప్రొ. అజీమున్నీసా, డా. అఖ్తర్ అలి, ప్రొ.మంగు నాయక్, డా. చల్లమల్ల వెంకటేశ్వర్లు, డా. కొండా నాగేశ్వర్‌రావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## అంతా ఇష్టారాజ్యమే!

గడువు ముగిసినా ఆఫర్ల రూపంలో.. సగటు మనిషి జీవన ప్రయాణం పెరుగుతున్న నేపథ్యం లో నేడు ఎన్నో ఉత్పత్తులు,సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఆఫీస్‌బాయ్ నుండి ఆఫీసర్ వరకు ఆయా స్థానాలను బట్టి నాణ్యమైన వస్తు, సేవలు వాడేందుకు మొగ్గుచూపుతున్నారు. వినియోగదారుల అవసరాలను గుర్తించిన పలు షాపింగ్‌మాల్స్ ఇంటర్నేషనల్ బ్రాండ్ల పేరుతో మోసాలకు పాల్పడుతున్నాయి. అంతర్జాతీయ బ్రాండ్లపేరుతో వినియోగదారులకు నిలువునా దోచేస్తున్నారు. ప్రముఖ సంస్థలకు చెందిన లేబుల్స్, ప్యాకింగ్‌లతో మసిపూసి మారేడుకాయ చేస్తున్నాయి. ముఖ్యంగా బ్రాండ్లపేరుతో ఓరకమైన మోసమైతే.. ఆఫర్లపేరుతో కూడా నగరవాసుల జేబులకు చిల్లుపెడుతున్నారు. కొన్ని షాపింగ్ మాల్స్ ఆఫర్లు అనగానే అందరూ తక్కువ ధరలకే వస్తున్నాయనే భావనలో ఉంటున్నారు. ఆయా సంస్థలు గడువు ముగిసిన ఉత్పత్తులనే ఆఫర్లు ఇస్తుండటంతో కొందరు అమాయక వినియోగదారులు కొనుగోలు చేసి మోసపోతున్నారు.

- బడా మాల్స్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం
- అడ్డగోలు ధరలతో వినియోగదారులకు కుచ్చుటోపి
- పట్టించుకోని తూనికలు కొలతలశాఖ అధికారులు
- స్టేటస్ సింబల్‌గా భావించి భరిస్తున్న జనం
- మోసపోతున్నామని తెలిసినా ప్రశ్నించడానికి వెనుకంజ



హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: ఇటీవల కాలంలో యువత షాపింగ్ చేయడంగానీ తినుబండారాల కోనుగోలు గానీ మాల్స్, మల్టీప్లెక్స్‌లలో చేయడం ఒక స్టేటస్‌గా భావిస్తున్నారు. ఈక్రమంలోనే తినుబండారాలు,వస్తువులకు వ్యాపారులు నిర్ధారించిన ధరలను చెల్లిస్తున్నారు. స్టేటస్‌మార్క్‌గా మాల్స్ పేరొందదడంతో అక్కడకు వచ్చేవారు ధరల విషయంలోనూ ప్రశ్నించడం లేదు. ఈనేపథ్యంలో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తున్నారు. చేసేది లేక వినియోగదారులు, కాస్తంత ఉల్లాసం కోసం వచ్చిన వారు ప్రశ్నించేందుకు వెనుకంజ వేస్తున్నారు. అయితే కొందరు మాత్రం నిర్వాహకులను ప్రశ్నించకుండా తూనికలు, కొలతల అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో జీవితం బిజీ బిజీగా మారిపోయింది.. బిజీ జీవితంలో క్షణం ఎంతో విలువైనదిగా మారింది. నిమిషంలో ఏమైన జరగవచ్చు..ఆనిమిషంలోనే వెళ్లాల్సిన బస్సు అందకుండా పోతుంది. ఆలస్యం కారణంగా ట్రాఫిక్ జామ్‌లతో పరిస్థితులు గందరగోళంగా మారుతుంటాయి.. అందుకే నగరవాసులు ఏవైనా కొనుగోలు చేయాలన్నా.. కాస్తంత ఉల్లాసంగా గడపాలన్నా.. సెలవురోజులనే ఎంచుకుంటారు. అదికూడా అన్నీ ఒకే ప్రాంతంలో లభించే వెసులుబాటును కోరుకుంటారు. వారాంతంలో లభించే అవకాశాన్ని వీలైనంత వరకు సద్వినియోగం చేసుకోవాలని చూస్తుంటారు. ఈక్రమంలోనే అందుబాటులోకి వస్తున్న మాల్స్‌కు ఇటీవల ఆదరణ పెరిగిపోయింది. మాల్స్‌లో ఏర్పాటయ్యే షోరూమ్స్, రెస్టారెంట్లు, మల్టీప్లెక్స్‌లు, గేమింగ్ జోన్స్‌తో బేదం లేకుండా అందరూ రోజంతా ఊరట పొందే అవకాశం కలుగుతుంది. అయితే ఇంతవరకు బాగానే ఉన్నా.. వస్తువులు తినబండారాలు, ఇతర సేవలపై వసూలు చేస్తున్న ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. విలాసానికి ప్రతీకగా హైక్‌చేస్తూ అందినంత దండుకోవడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. హైఫైజోన్‌లుగా పరిస్థితులు రూపొందించిన మాల్స్,మల్టీప్లెక్స్‌లు, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్,హైటెక్‌సిటీ ప్రాంతాల్లో అనేకంగా ఉన్నాయి. వారు తాము తీసుకునే వస్తువులకు, ఆహార పదార్థాలకు నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్నా.. వారిమోసాలను హైఫైగా భావించి వినియోగదారులు భరిస్తుండటం ఇప్పుడు నగరంలో హాట్ టాఫిక్‌గా మారింది. తూనికలు, కొలతల అధికారులు ఇటీవల షాపింగ్‌మాల్స్, మల్టీప్లెక్స్‌లలో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్న సందర్భంలో పలు అంశాలు చర్చకు వస్తున్నాయి. బేకరీలో అమ్మే రూ.25 గల కూల్‌డ్రింక్‌కు మల్టీప్లెక్స్‌లో రూ.150 చెల్లించాల్సిన పరిస్థితికి కారణం ఏంటీ..? బయట దుకాణాల్లో 500లకు లభించే షర్టుకు మాల్స్‌లో రూ.2000వేలు ఎందుకు చెల్లించాల్సి వస్తుంది. అందులో కొనేవన్నీ బ్రాండెడ్ వేనా..లేకా అందులో కొనడమే ఒక స్టేటస్‌హా అనే అంశాలను పలువురు వినియోగదారులు చర్చిస్తున్నారు.

**అధికారులకు ఒత్తిళ్లు..** గత కొన్ని రోజుల క్రితం తూనికలు కొలతల అధికారులు మాల్స్,మల్టీపెల్లెక్స్‌లో దాడులు నిర్వహిస్తు కేసులు నమోదు చేశారు. అయినా వారిలోమార్పు రావడం లేదు. ఎందుకంటే అవన్నీ రాజకీయ నాయకులు, వారీ బంధవులకు సంబంధించినవే కావడంతో అధికారులు కూడా చేతులెత్తేస్తున్నారు. ఇటీవల ఓ షాపింగ్‌మాల్‌పై రెండవసారి దాడులకు వెళ్లిన తూనికలు,కొలతల అధికారులకు ఓ రాజకీయ నాయకుడి నుండి ఒత్తిళ్లు రావడంతో తూతూమంత్రంగానే దాడులు నిర్వహించి ఎలాంటి కేసులు నమోదు చేయకుండా వెనుదిరినట్లు సమాచారం. దీంతో బడాషాపింగ్‌మాల్స్‌వైపు తనిఖీలకు వెళ్లాలంటే అధికారులు జంకుతున్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని పెట్రోల్ బంకు క్యాషియర్ మృతి

జీడిమెట్ల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన బాలరాజు(41) పెట్రోల్ బంకులో క్యాషియర్‌గా పనిచేసుకుంటూ సంజయ్‌గాంధీ నగర్‌లో కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. అయితే బాలరాజు ప్రతిరోజులాగే సోమవారం పెట్రోల్ బంకుకు ఇంటి నుంచి మధ్యాహ్నం 3గంటలకు బయలేదేరగా షాపూర్‌నగర్‌లోని శుభం హోటల్ సమీపంలోని బస్టాండ్ వద్ద ఏపీ28జెడ్2886 నెంబర్ గల ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలరాజు తీవ్రగాయలతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## విద్యా ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి : మంత్రి మల్లారెడ్డి



మంత్రి మల్లారెడ్డికి పుస్తకాన్ని అందజేస్తున్న డిపీఎస్ చైర్మన్ మల్కా కొమురయ్య

తార్నాక, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: విద్యా,ఉపాది అవకాశాల కల్పణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. డిపీఎస్, పల్లవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ టుడే కాంక్లేవ్ (హెచ్‌టీసీ) పై నిర్వహించిన సదస్సుకు మంత్రి మల్లారెడ్డి హాజరైన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ సుమారు500 కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చి ఉపాధి అవకాశాలను పెంపొందించారని గుర్తు చేశారు. విద్యార్థులు కష్టపడి చదివితే అసాధ్యమైనదేదీ లేదని, తాము చేసే పనిపై దృష్టి సారించాలని సూచించారు. ట్రాన్‌ఫార్మింగ్ మేనేజ్ మెంట్ ఎడ్యూకేషన్ అనే అంశంపై లోక్ సత్తాపార్టీ వ్యవస్థాపకులు డా.జయప్రకాష్ నారాయణ ప్రసంగించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయని యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం హెచ్‌టీసీ సహా వ్యవస్థాపకులు మల్కా యశస్వీ విద్యారంగంపై మంత్రి కమల్లారెడ్డిని అడిగిన ప్రశ్నలకు సమాదానం ఇచ్చారు. చైర్మన్ మల్కకొమురయ్య కాంక్లేవ్ ముఖ్య ఉద్దేశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీబీఎస్‌ఈ డైరెక్టర్ డా. బిస్వజిత్ సాహాతో పాటు 800 మందికిపైగా ఉపాధ్యాయులు, పేరెంట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోఠిలో బాంబు కలకలం



అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 17ప్రభాతవార్త: కోఠిలోని ఆంధ్రా బ్యాంకు చౌరస్తాలో ఓ సూట్ కేసు కలకలం రేపింది. ఆంధ్ర బ్యాంకు చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా సూట్ కేసు కనిపించింది. ఇది గమనించిన స్థానికులు సుల్తాన్‌బజార్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన ప్రదేశానికి చేరుకున్న పోలీసులు, బాంబుస్కాడ్స్ ద్వారా తనిఖీ చేశారు.ఈ సూట్‌కేసులో బట్టలు, పెర్ఫ్యూమ్ తప్ప ఏమి లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఓ మహిళకు చెందిన సూట్‌కేసుగా పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో కొద్ది సేపు స్థానికులు భయాందోళనకు గురయ్యారు. బ్యాగ్ వదిలి మహిళను స్టేషన్‌కు తీసుకువెళ్లి పూర్తి వివరాలను తీసుకుని తరువాత వదిలివేశారు.

## శతక ప్రేమికుడు అభ్యుదయ భావుకుడు వేణుశ్రీ

**తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి**



కైరవ శతకంను ఆవిష్కరిస్తున్న సిధారెడ్డి, అయాచితం, కందుకూరు, వేణుశ్రీ, రాజమణి తదితర అతిథులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : ఆధునిక భావాలను శతకాలు రచించడంలో సిద్ధహస్తుడు, చేయితిరిగిన స్వేచ్ఛాకవి, ఎంతో ప్రజ్ఞావంతుడైన వేణుశ్రీ శతక ప్రేమికుడు, ఆదర్శ అభ్యుదయ భావకుడని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి అన్నారు. వర్తమానంలో శతకం పద్యప్రేమికులను విశేషంగా ఆకర్షిస్తుందని, సమకాలీన పరిస్థితులపట్ల తమ స్పందనలను తెలుపడానికి అనువుగా ఉండడంతో కవులు శతకం వైపు మొగ్గుచూపుతున్నారని, ఏ భావానికి కాభావం విడిగా వ్యక్తీకరించే అవకాశం శతకంలో ఉన్నంతగా మరేప్రక్రియల్లో లేదని, శతక పద్యాల్లోని ఛందో నియమం కొత్త సౌదర్యానిస్తుందని, చదవడానికి, చెప్పడానికి, గుర్తుపెట్టుకోవడానికి, రచించడానికీ సులువుగా ఉంటుందని, అందుకే తెలుగు సాహిత్యంలో లఘు ప్రక్రియలు విస్తృత ప్రాచుర్యం పొందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వేణుశ్రీ కైరవ్ అనే తన మనుమడిని ఉద్దేశించి మకుటంగా మలిచి చెప్పిన శతకం కైరవ్ శతకమని, ఇది తాతలకు మనువళ్లకు ముచ్చట, కవి తాతలకు మనుమళ్ల శతకాలొక ముచ్చట, ముచ్చటలకు మురిపెమే హద్దని, వేణుశ్రీ మురిపెంలో సామాజిక కలవరముందని, తన భావాలు, తన కాలపు పరిస్థితులు, తన ఆదర్శాలు రాబోయేతరానికి అందించాలన్న తపన వేణుశ్రీ శతకంలో సుస్పష్టంగా కనిపిస్తుందని సిధారెడ్డి కొనియాడారు.

## మహనీయుల జయంతోత్సవాలు జరుపుకోవడం ఎంతో అవసరం



నిజాం పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రొఫెసర్లు

సైఫాబాద్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: మహాత్మా జ్యోతిరావ్ ఫ్రూలే, డా.బి.ఆర్.అంబేద్కర్, డా.బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు సోమవారం నిజాం కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ వేడకలను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ భీమా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సెంట్రల్ యూనివర్సిటి ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ మహనీయుల జయంతోత్సవాలు జరుపుకోవడం నేటి సమాజానికి యువతరానికి పరిశోధక విద్యార్థులకు ఎంతో అవశ్యత కలిగిన అంశమన్నారు. వారి నుంచి నవతరం నేర్చుకోవాల్సిన స్ఫూర్తి ఎంతో ఉందన్నారు. ఓయూ ఔటా ఉపాక్షులు, ప్రొఫెసర్ మల్లేశం మాట్లాడుతూ దళిత బహుజనులు అంతో ఇంతో ఉద్యోగాలలో గౌరవ స్థానంలోకి రావడానికి అంబేద్కర్ ఎంతో కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్-ప్రిన్సిపల్ ఉపెందర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ కో-ఆర్డినేటర్ డా.భూక్యా తిరుపతి, డా.సి.హెచ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## పాతబస్తీలో వడగళ్ల వాన

### ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

చార్మినార్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలో సోమవారం సాయంత్రం వడగళ్లు వాన కురిసింది.దాదాపు అరగంట సేపు గాలి వీయటంతో పాటు పెద్ద పెద్ద వడగల్లు పడ్డాయి. ఆకస్మాత్తుగా వర్షం కురవటంతో రహదారులలో వర్షం నీరు నిలిచి పోయింది. వడగళ్ల వానంతో చార్మినార్, మదీనా, పటేల్ మార్కెట్, దివాన్‌దేవిడి, మూసాబౌలి, లాడ్‌బజార్, ఆర్‌జె మార్కెట్, బిజె మార్కెట్, గోపాల్ మార్కెట్, ముంతాజ్ మార్కెట్, గాడ్‌గిఫ్ట్ మార్కెట్, ఉర్దూగల్లీతో పాటు పాతబస్తీలోని పలు మార్కెట్లలో వస్తువులు,వస్త్రాలు ఖరీదు చేయటానికి వచ్చిన కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రంజాన్ మాసం సందర్భంగా చార్మినార్ పరిసర ప్రాంతాలలో ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేశారు.కాగా సోమవారం సాయంత్రం ఒక్కసారి కురిసిన వడగళ్ల వర్షానికి చార్మినార్ సరిసర ప్రాంతాలలోని పుట్‌పాత్‌ల మీద ఉన్న షాపులలోని వస్తువులు తడిచి ముద్దయ్యాయి.చార్మినార్‌ల్‌దర్వాజ,మీర్‌చౌక్, ఎత్తెబార్‌చౌక్, మీరాలం మండి, దారుషిఫా, మొగల్‌పుర, సర్దార్‌మ హాల్, పంజే షా, చౌమహల్లా ప్యాలెస్, మోతీగల్లీ, గుల్జారాహౌస్, మూసాబౌలి, బహదూర్ పుర, పురానాపూల్, సిటీ కళాశాల, బేగం బజార్, అఫ్జల్ గంజ్, గౌలిగూడ, అబిడ్స్,మొజంషాహి మార్కెట్, నాంపల్లి, లక్డీకాపూల్, కందికల్‌గేట, ఛత్రినాక, గౌలిపుర,శాలిబండ,అలియాబాద్,హుస్సేనీఆలం,ఘాన్సీ బజార్,చాదర్‌ఘాట్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాలలో సోమవారం సాయంత్రం కురిసిన ఆకస్మాత్తు వర్షం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ సిటీ కళాశాల,హైకోర్టు రహదారి,మదీనా,నయాపూల్ వంతెన,బేగం బజార్,అఫ్జల్‌గంజ్ ప్రాంతాలలో ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో వాహనాల రాక పోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.దాదాపు అర్ధగంట వరకు ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచి పోయాయి.కాగా వడగళ్ల వర్షం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు.



## క్రీడా టోర్నమెంట్లు యువత నైపుణ్యాన్ని రెట్టింపు చేస్తాయి

**క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందించిన ఎమ్మెల్యే**



వట్టినాగులపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

నార్సింగి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : క్రీడా టోర్నమెంట్లు యువతలోని నైపుణ్యంను రెట్టింపు చేస్తాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం నార్సింగి మున్సిపల్ పరిధిలోని వట్టినాగులపల్లిలో బిఆర్.అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు గండిపేట్ మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా, చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి, మాజీ ఎంపిటిసి, సీనియర్ బిఆర్‌ఎస్ నేత గొల్ల నాగేష్ యాదవ్‌లతో కలిసి ఎమ్మెల్యే కప్‌లు, సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఆటలు ఆడడం వలన మనలో చురుకుదనం, ఆరోగ్యం పెరుగుతుం దన్నారు. ఆటల్లో గెలుపు మనలో నూతనోత్తేజాన్ని కలిగిస్తుందని, ఓడిపోతే గెలువాలన్న కసి, పట్టుదల పెరుగుతుందన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరిస్తారని, ఫలితంగా జీవితంలో ఎదురయ్యే ఓటములకు కుంగిపోకుండా గెలిచే వరకు పోరాడే తత్వం అలవడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను ర్యాంకులు తేవాలని, అనుక్షణం పుస్తకాల పురుగుల్లా మార్చడం సరికాదని, రోజులో ఓ గంట వ్యాయామా నికి, ఓ గంట ఆటలకు వదిలిపెట్టాలని సూచించారు. చదువులతో పాటు ఇప్పుడు క్రికెట్, ఫుట్‌బాల్, షటిల్, బ్యాట్మెంటన్, కబడ్డీ, హాకీ వంటి ఆటలు ఆడే వారికి సైతం ఉపాధి లభిస్తుందన్నారు. చదువు, ఆటలు రెండింటికి సమ ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు యాదమ్మ, పత్తి ప్రవీణ్, కిషోర్, ప్రదీప్, పర్వేద రాజు, ప్రముఖులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## గోల్నాక డివిజన్‌లో బిజెపి సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు

హైదరాబాద్ ఏప్రిల్ 17 ప్రభాతవార్త: గోల్నాక డివిజన్‌లోని జైస్వాల్ గార్డెన్ శక్తికేంద్రంలో పోలింగ్ బూత్ 100లో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు హాజరై ప్రసంగించారు. పోలింగ్ బూత్ ససక్తీకరణ కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో బిజెపి డివిజన్ కన్వీనర్ బూల రవీందర్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ మోత్కుల శ్యామ్ రాజ్ మూదిరాజ్, యువమోర్చ సెంట్రల్ జిల్లా కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, సిహెచ్.వేణుగోపాల్, ఎం.అరుణ్‌కుమార్, ఎం.శ్రీనివాస్, పి.శంకర్‌గౌడ్, ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

## స్త్రీ సాధికారతకు ప్రతీక మొల్ల



ప్రసంగిస్తున్న తెలంగాణ సాహిత్యఅకాడమి చైర్మన్ జూలూరి గౌరీశంకర్

చిక్కడపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: పురుషులే ప్రబంధ కావ్యాలు రచిస్తున్న కాలంలో మొల్ల రామాయణ కావ్యరచన తనదైవన అవగాహనతో చేసి స్త్రీ సాధికారతకు ప్రతీకగా నిలిచారని తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరిగౌరీ శంకర్ అన్నారు. శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా ప్రముఖ కవయిత్రి మొల్ల ఆతుకూరి యాదిలో కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జూలూరి గౌరీశంకర్ మాట్లాడారు.

## ఘనంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అవార్డ్స్-2023 ప్రదానోత్సవం

రవీంద్రభారతి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సీల్‌వెల్ సినీసుస్వరాల తెలుగు హిందీ సినీ మెగా మ్యూజికల్ నైట్; ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అవార్డ్స్-2023 వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు సీల్‌వెల్ కార్పొరేషన్ సీఈఓ, సేవాసమ్రాట్ బండారు సుబ్బారావు, శృతిలయ ఆర్ట్స్ ఛైర్మన్ డా. బి.భీమ్‌రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి, ప్రఖ్యాత గాయని ఆమనిలు మీడియాకు తెలిపారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూతనాచారి సభాధ్యక్షతన ఈ నెల 20 గురువారం మధ్యాహ్నం 1.30నుండి రాత్రి 9.30గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరవుతున్న తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి విశిష్ట అతిథులు తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, సీనియర్ పాత్రికేయుడు డా. మహ్మద్‌రఫీ, గౌరవ అతిథులు జితేంద్ర, రాజ్‌గోపాల్, డా. కుసుమ భోగరాజు, రామకృష్ణ తదితరులతో కలిసి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రముఖ జర్నలిస్టులు సిహెచ్.సుశీల్‌కుమార్‌కు శృతిలయ-సీల్‌వెల్ విశిష్ట పాత్రికేయ జీవనసాఫల్య పురస్కారం; ఉమాసుధీర్, డి.శ్రీనివాసరావు, స్వప్న, ఇస్మాయిల్, సుభాషిణి, కళ్యాణిలకు శృతిలయ-సీల్‌వెల్ విశిష్ట పాత్రికేయ శిరోమణి; స్వర్లడెబోరా, మంజూష, కళశ్రీనివాసరావు, దేవిప్రియాంకలకు శృతిలయ-సీల్‌వెల్ ఉత్తమ పాత్రికేయ పురస్కారాలను ప్రదానం చేస్తారని, ప్రముఖ సినీ నేపథ్యగాయని బి.రమణకు స్వరరమణి బిరుదు ప్రదానం చేయనున్నట్లు వారు వివరించారు. సభకుముందు, సభానంతరం నవరసగాయని ఆమని నేతృత్వంలో సూర్యతేజ కీబోర్డు, ఎన్.అనిల్ తబల, విద్యాసాగర్ తబల, శివరామ్‌రెడ్డి రిథమ్‌ప్యాడ్స్‌పై వాద్యసహకారంతో సీల్‌వెల్ సినీసుస్వరాల శీర్షిక ప్రముఖ వర్ధమాన గాయకులతో తెలుగు హిందీ మ్యూజికల్ నైట్ జరుగుతుందని, అధికసంఖ్యలో ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి ఆయా కార్యక్రమాలను ఆస్వాదించి విజయవంతం చేయాలని బండారుసుబ్బారావు, భీంరెడ్డి, ఆమనిలు కోరారు.

## విగ్రహాల ఏర్పాటుతో దళితుల ఆకలి తీరదు

**27న అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా : తెలంగాణ లేబర్ పార్టీ అధ్యక్షులు గొర్రె రమేష్**

హైదరాబాద్, ఏప్రిల్ 17,ప్రభాత వార్త: రాష్ట్రప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమిని పంపిణీ చేయాలని, భూసంస్కరణల చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న ట్యాంక్‌బండ్‌పై గల 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించన్నుట్లు తెలంగాణ లేబర్ పార్టీ అధ్యక్షులు గొర్రె రమేష్ అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రారంభించడాన్ని తెలంగాణ లేబర్ పార్టీ అభినందిస్తుందని అయితే విగ్రహాన్ని ఏర్పాటు చేసినంత మాత్రాన దళితుల బతుకులు మారవని విగ్రమాలను చూసి దళితులు ఆకలి తీర్చుకోలేరన్నారు. దళితులు అన్నిరంగాల్లో ఎదగాలంటే ఎన్నికల్లో దళితులకు ఇచ్చిన హామీలు 3ఎకరాలు, దళితబంధు, ఇవ్వాలన్నారు. అంబేద్కర్ విగ్రమాన్ని పెట్టి దళితుల ఆత్మగౌరవం నింపినట్లుగానే గతంలో కెసిఆర్ ఇచ్చిన హామీ మేరకు మిగతా ఎనిమిది నెలల కాలానికి దళితుడుని ముఖ్యమంత్రి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మట్టారెడ్డి, తుమ్మలపల్లి లక్ష్మీ, కోశాధికారి లక్ష్మీ, స్టూడెంట్ యూనియన్ అధ్యక్షులు మంచాల మహేష్, ఆంజనేయులు, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న గొర్రె రమేష్ తదితరులు

## పాతబస్తీలో మొబైల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

**చార్మినార్ ఎడిఇ విజయ్‌కుమార్**

చార్మినార్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : రంజాన్ మాసం సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండ ఉండేలా ప్రత్యేకంగా మొబైల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని చార్మినార్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు విజయ్ కుమార్ తెలిపారు.పాతనగరంలోని చార్మినార్,మొగల్‌పుర,హుస్సేనీఆలం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధులలోని పలు ప్రాంతాలలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన విద్యుత్ సిబ్బందితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా చార్మినార్ ఎడిఇ విజయ్ కుమార్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండ ముందు జాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు.చారిత్రక మక్కామసీదులో మొబైల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని ఆయన తెలియజేశారు.అదే విధంగా విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి సమస్యలు వచ్చిన ప్రత్యేకంగా మూడు మొబైల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్లను ఉంచామని, రంజాన్ మాసంలో పాతబస్తీలో ఎక్కువ విద్యుత్ వినియోగం జరుగుతున్నందున ప్రజలకు ఇబ్బందులు కలగకుండ ఉండేలా 500 కెవి.315 కెవి.160 కెవిల సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని, విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది ఇరవై నాలుగు గంటలు ప్రజలకు అందుబాటులో ఉన్నారని ఎడిఇ విజయ్ కుమార్ వెల్లడించారు.

## స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణ.. ఒకరు మృతి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల 17 ప్రభాతవార్త: వంట విషయంలో ఇద్దరి స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి మృతికి కారణమైన సంఘ టన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఒడిషా రాష్ట్రానికి చెందిన దశరథ్ మాలిక్,అశోక్ మాలిక్ ఇద్దరు దూలపల్లిలోని అపర్ణ పామ్ గ్రోవ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌లో కూలీ పనులు చేస్తున్నారు. అయితే ఆదివారం రాత్రి 9గంటల సమయంలో వంట చేసే విషయంలో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణలో ఒకరినొకరు తోపులాడుకున్నారు. ఈ తోపులాటలో ఇద్దరు ప్రమాదవశాత్తు గోడపై నుంచి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కూలీలు క్షతగాత్రులిద్దరిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి కన్‌స్ట్రక్షన్ వద్ద ఉన్న వారి గదికి తీసుకువచ్చారు. మరుసటి రోజు ఉదయం తోటి కూలీలు అశోక్ మాలిక్, దశరథ్ మాలిక్‌లు పరామర్శించడానికి గదికి వెళ్ళగా దశరథ్‌మాలిక్ మృతిచెంది ఉన్నాడు. ఈ విషయంపై పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలాని చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న టిఎన్‌జిఓ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ

బేగంబజార్, ఏప్రిల్ 17ప్రభాతవార్త: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని స్టాంప్సు, అండ్ రిజిస్ట్రేషన్ శాఖ,ఎస్.ఆర్.ఓ వల్లబ్‌నగర్ కార్యాలయంలో తెలంగాణ నాన్ గజిటెడ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ, సబ్ రిజిస్ట్రార్ విజయ్ ఆధ్వర్యంలో ముస్లీంసోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈకార్యక్రమంలో వక్ఫ్ బోర్డు ఛైర్మన్ మాసిఉల్లా, స్టాంపు అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ వెంకట రాజేష్,డిప్యూటి రిజిస్ట్రార్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ట్విమ్కిల్‌జాన్, సుబాషిణి,సైదిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ రమేష్‌రెడ్డి,డి.వి.ప్రసాద్, స్థితప్రజ్ఞ, రవీందర్‌రావు, టిఎన్‌జిఓ ప్రతినిధులు విక్రమ్‌కుమార్,కె.ఆర్.రాజ్‌కుమార్,ఓమర్‌ఖాన్,కె.శ్రీనివాస్, ఖాలేద్‌అహ్మద్,వైదిక్‌శాస్త్రి, ఎం.ఏ.ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

## మంచి చిత్రాలకు ఆదరణ ఎప్పుడూ ఉంటుంది

చిక్కడపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: శ్రీ శారద మ్యూజిక్ అకాడమి అధినేత్రి, గాయనీ శారద ఆధ్వర్యంలో ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావుకు ఆత్మీయ సత్కార కార్యక్రమం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. ముఖ్యఅతిథిగా వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావు హాజరై రేలంగి నర్సింహారావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త ఎల్‌సి.రావు, మధుర గాయకుడు రామ్‌కుమార్, మోటివేటర్ రామకృష్ణ తనికెళ్ళ, గోర్తి చంద్రశేఖర్, సంతోష్ మాచెర్ల, యువ గాయకుడు, సంస్థ ఉపాధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మధురగాన మయూఖ రేణుకారమేష్, నిర్వాహక సంస్థ అధ్యక్షురాలు శారద నిర్వహణలో తెలుగు-హిందీ సినీ సంగీత విభావరి అందరిని అలరించింది. గాయనీ గాయకులు పద్మ, అచ్యుత, భార్గవి, రమాదేవి, డాక్టర్ వాసుదేవరెడ్డి, సుబ్బిరెడ్డి, సంపత్, వారణాసి సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహస్వామి, సురేందర్, వేణుగోపాలచారి, శోభన్‌బాబు, కెవిఎన్‌ఆర్‌సి.మూర్తి తదితరులు అద్భుతంగా గానం చేశారు.

## పుణ్యతిథిని పురస్కరించుకొని అన్నదానం



బేగంపేట ఏప్రిల్ 17,ప్రభాతవార్త : సనత్‌నగర్ నియోజక వర్గంలో భారతీయ జనతాపార్టీలో తనకంటూ ప్రత్యేక స్థానం ఉన్న దివంగత భావర్‌లాల్ వర్మ 2వ పుణ్యతిథి ని పురస్క రించుకొని సోమవారం సుభాష్‌రోడ్డు వర్మ గార్డెన్స్‌లో వర్మ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా దివంగత భావర్‌లాల్ వర్మ కుమారుడు సందీప్ వర్మ మాట్లాడుతూ సనత్‌నగర్ నియోజకవర్గంలో తన తండ్రిని అభిమానించే వారందరికి ముందుగా ఆయన హృద యపూర్వక అభినందనలు తెలియ జేసారు. నియోజకవర్గం లో భారతీయ జనతాపార్టీ అంటే ఏమిటన్నది చూయించిన వ్యక్తి తన తండ్రి అని అన్నారు. అలాగే ఎంతో మంది నాయకులను ఆయన ప్రోత్సహించారని అన్నారు.తన తండ్రి ఆశయాల సాధనకు తన వంతు కృషి చేస్తానన్నారు. కుటుంబ సభ్యుల సహకారంతో పాటు నియోజకవర్గ ప్రజలు అభిమానం మరువలేని దని ఆయన పేర్కొన్నారు. ఈ అన్న దాన కార్యక్రమంలో బీజేపీ నాయకులు నెమలి ఆనంద్ (నందూ),జగదీష్ ప్రసాద్ వర్మ,సురేష్ రావల్,ఆకుల ప్రతాప్, పెద్ది అనిల్,ఒనమల నరేందర్, నరేందర్‌వర్మ, నమన్‌జైన్, కాశీశ్వర్, రమేష్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : కొంతం దీపిక



మోండా డివిజన్‌లోని కోనేరు వరహా స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కార్పోరేటర్ కొంతం దీపిక

అడ్డగుట్ట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలి స్వామి వారిని వేడుకున్నట్లు మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. మోండా డివిజన్‌లోని కోనేరు వరహా స్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుక లకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మాన సిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలన్నారు. భగవంతున్ని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయన్నారు. ఈ సందర్భంగా వరహా జయంతి వేడుకల్లో 108 కళశా భిషేకం, తీర్థ ప్రసాదం, అన్నమాచార్య కీర్తనలు వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వై.నర్సారెడ్డి, ఈఓ సత్య మూర్తి, ధర్మకర్తలు కాశిరెడ్డి, నరేశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి కార్మికులకు సన్మానం



జిహెచ్ఎంసి కార్మికులను సన్మానించిన గొల్కొండ బిజెపి అధ్యక్షులు వి.పాండుయాదవ్,ఎస్సీమోర్చ ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వా

గన్‌ఫౌండ్రి, ఏప్రిల్ 17ప్రభాతవార్త: తెలంగాణ బిజెపి ఎస్సీమోర్చ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాలను మే 5వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చ ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వా తెలిపారు.సోమవారం గన్‌ఫౌండ్రి డివిజన్‌లో నిర్వహించిన అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు గొల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు వి.పాండు యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సారథ్యంలో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు.ముఖ్యంగా కార్మికులను ప్రత్యేక గుర్తింపు ఇచ్చినట్లు తెలిపారు.అనంతరం గన్‌ఫౌండ్రి డివిజన్‌లోని జిహెచ్ఎంసి కార్మికులను శాలువ కప్పి సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చంద్రశేఖర్, నరహరి,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సొసైటి ఆధ్వర్యంలో సభను నిర్వహణ

బేగంబజార్,ఏప్రిల్ 17ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి, సిఎం.కెసిఆర్ ప్రత్యేకంగా భారతరాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరును నామకరణం చేసినందుకుగాను ఈనెల 21వ తేదిన బాబు జగ్జీజీవన్‌రాం ఏడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటి ఆధ్వర్యంలో సభను నిర్వహిస్తున్నట్లు సొసైటి అధ్యక్షులు కొమ్ముల నరేందర్ తెలిపారు.



గోల్నాక డివిజన్ లాల్‌బాగ్ మజీద్‌లైన్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ నిండిపోవడంతో అధికారులతో కలిసి బాగుచేయిస్తున్న కార్పోరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

## చెరువులు సుందరీకరణకు ప్రాధాన్యత: ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

అల్వాల్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: చెరువులను కాలుష్య రహితంగా మార్చడంతో పాటుగా సుందరీకరణ ద్వారా ప్రజలకు అందుబాటు లోకి తెస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. సోమవారం అల్వాల్ పట్టణ పరిధిలోని చినరాయుని కొత్త చెరువులను ఎమ్మెల్యే ఎంఎయుడి ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్‌తో పాటుగా ఇతర ఉన్నతాధికారులు కార్పొరేటర్లుతో కలిసి పరిశీలించడం జరిగింది. చెరువులులో పేరుకు పోయిన వ్యర్థాలు గుర్రపు డెక్కను తక్షణం తొలగించేందుకు నిర్ణయించారు. రెండవ దశలో సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. చెరువులులో కలుస్తున్న మురికి నీటి మళ్లింపు ఈ ప్రక్రియలో ప్రధానమైనదిగా పేర్కొవచ్చు. ఎండా కాలం లోపు వ్యర్థాలు పూడికతీత పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే మైనంపల్లి అధికారులను కోరడం జరిగింది. ఎమ్మెల్యే ప్రతిపాదనకు ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ సాను కూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జితేందర్ నాథ్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి లేక్స్, హౌసింగ్ సిఇ సురేష్ కుమార్ ఎస్ఇసి ఆనంద్ జడ్‌సి మమత తహసీల్దార్ నాగమణి సర్కిల్ డిసి నాగమణి ఎసిపి విజయశ్రీ ఇఇ రాజు డిఇ మహేష్ బిఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**పార్కు స్థలం కబ్జాదారుడిపై ఎమ్మెల్యే ఆగ్రహం**

శ్రీనగర్ కాలనీ పార్కు స్థలం కబ్జాదారుడిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీ పార్కు స్థలం పరిశీలనకు ఎమ్మెల్యే వచ్చిన సందర్భంలో కబ్జాదారుడు దస్తావేజులు చూపించడానికి ప్రయత్నిం చడం జరిగింది. రిజిస్ట్రేషన్‌తో పాటుగా ఇంటి అనుమతిని తక్షణం రద్దు చేయాలని ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పార్కులు జోలికి వస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33/11కేవీ మయూరి నగర్ సబ్‌స్టేషన్ ఫీడర్ల మరమ్మత్తుల సందర్భంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ అధికారులు పత్రికా ప్రకటనలో తెలిపారు. 11కేవీ కేటీఆర్ ఫీడర్ పరిధిలోని కొలన్ నారాయణరెడ్డి కాలనీ, కెఎస్ఆర్ పార్కు, శ్రీనివాస కాలనీ, వెంకట సాయి హోమ్స్,జెఎన్ఎన్‌యూఆర్ఎం ఫేజ్3 తదితర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ ఉండదు. కావునవిద్యుత్ వినియోగదారులు గమనించి సహకరిం చాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు.

## 'బిజెపి హటావో దేశ్ బచావో' పేరుతో సిపిఐ కరపత్రాల పంపిణీ

చిక్కడపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: దేశ సంపదను ఆదాని, అంబానీలకు విక్రయిస్తున్న మోదీ సర్కార్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.వెంకటేశ్, నగర సహాయ కార్యదర్శి కమతం యాదగిరి పిలుపునిచ్చారు. సోమవారం సిపిఐ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ బి.వెంకటస్వామిగౌడ్ ఆధ్వర్యంలో 'బిజెపి హటావో దేశ్ బచావో' పేరుతో నిర్వహించిన ప్రచారోద్యమ కార్యక్రమం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు వద్ద ప్రారంభమైంది. మోదీ సర్కార్ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలిపేందుకు కరపత్రాలను పంపిణీ చేసి ప్రసంగించారు. బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటివరకు అమలుకు నోచుకోలేదని, ప్రభుత్వరంగ సంస్థలను మోదీ సర్కార్ తన ఆప్తమిత్రులకు అప్పగిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజ కవర్గం సహాయ కార్యదర్శి సురేందర్, సిహెచ్.శ్రీనివాస్, ఉపేందర్, రాములు, శేఖర్, రవి, రాజేందర్, ఆనంద్ పాల్గొన్నారు.

## రంజాన్ కానుకల పంపిణీ



రంజాన్ కానుకలను అందచేస్తున్న బిఆర్ఎస్ నాయకులు పి.సంతోష్‌గుప్త

అప్జల్‌గంజ్,ఏప్రిల్ 17ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ప్రతి యేటా రంజాన్‌మాసాన్ని పురస్కరించుకుని ముస్లీం మైనార్టీలకు అందించే రంజాన్ కానుకలను గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు పి.సంతోష్‌గుప్త అందచేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్య మంత్రి కెసిఆర్ అన్నివర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మైనార్టీలకు రంజాన్ మాసంలో మైనార్టీలకు రంజాన్‌కానుకలను అందచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌కే దక్కుతుందన్నారు.

## వెస్ట్ మారేడ్‌పల్లిలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి : శ్రీగణేష్

అడ్డగుట్ట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని వెస్ట్ మారేడ్‌పల్లి లక్ష్మయ్యదొడ్డి, వివేకానంద నగర్ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని వాటి పరిష్కారానికి జలమండలి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కంటోన్మెంట్ బిఆర్ఎస్ నాయకుడు ఎన్.శ్రీగణేష్ జలమండలి ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సికింద్రాబాద్ వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్ రమణారెడ్డి, మారేడ్‌పల్లిలో తలెత్తిన సివరేజ్‌లైన్ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. వీలైనంత త్వరలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిఎం.రమణారెడ్డి హామీఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు భాస్కర్ గౌడ్, రౌతు రాజయ్య, విక్కీ, మల్లేశ్, గౌతమ్, పవన్ పాల్గొన్నారు.

**రంజాన్ వేడుకలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి : జక్కుల మహేశ్వర్ రెడ్డి**

రంజాన్ వంటి వేడుకలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి కంసరి బజార్ మజీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు ముప్పిడి మధుకర్, విజయ్,ముస్లిం మైనార్టీ నాయకులు షరీఫ్, అసీన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో డిప్యూటీ సిఈవో సేవలు అమోగం : గోపాలక్రిష్ణదాస్

కంటోన్మెంట్,ఏప్రిల్ 17 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన్తున్న డిప్యూటీ సిఈఓ విజయ్‌కుమార్ బాలన్ నాయర్ సేవలు అమోగమని బోర్డు మాజీ బోర్డు ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్, ఛీఫ్ ఇంజనీర్ గోపాలక్రిష్ణదాస్‌లు తెలిపారు. సోమవారం డిప్యూటీ సిఈఓను మర్యాదపూర్వకంగా కలిసి బోర్డులో ఆయన చేసిన సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు బాలక్రిష్ణ, ప్రముఖ న్యాయవాధి తదితరులు పాల్గొన్నారు.



ఒయులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్,రిజిస్టార్ లక్ష్మీనారాయణ

## సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



ఎన్ఎస్‌కెకె పాఠశాల వద్ద కరపత్రాలతో సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు

జీడిమెట్ల, ఏప్రిల్17 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సోమవారం మేడ్చల్ జిల్లాలోని ఎన్ఎస్‌కెకె ఉన్నత పాఠశాల నుంచి బాలానగర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్ఈ యూ అధ్యక్షుడు మాట్లాడుతూ 1982లో సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం పెన్షన్ అనేది భిక్ష కాదని,ఉద్యోగుల భద్రత అది ప్రభుత్వాల బాధ్యత అని గుర్తు చేశారు. ఈ సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని,సీపీఎస్ విధానాన్ని రద్దు చేసిఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగం : జంపనప్రతాప్




బోయిన్‌పల్లి బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్,ఏప్రిల్ 17 ప్రభాతవార్త: వేసవిలో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు దాహం తీర్చేందుకు ప్రధానకూడలీల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. శ్రీ సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బోయిన్‌పల్లి బస్టాప్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బోయిన్‌పల్లి నుంచి నిత్యం వేలాది మంది వివిధ ప్రాంతాలకు ప్రయాణికులు వచ్చిపోతుంటారని, వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోపడు తాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సేవా సంస్థ కన్వీనర్ చంద్రశేఖర్, బ్రిగేడియర్ మోహన్‌రావ్, కమిటీ ప్రతినిధులు రమేశ్,రామారావ్, శ్రీకాంత్, రఘునందన్‌రావ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే రోజుల్లో ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రిజర్వేషన్‌లు ప్రవేశపెట్టాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: రాబోయే రోజుల్లో బడుగు, బలహీనవర్గాల వారిని అభివృద్ధిలో భాగస్వాములు చేయడానికి ప్రైవేట్ రంగంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ వర్గాలకు రిజర్వేషన్‌లు ప్రవేశపెట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ కోరారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా 125 అడుగుల బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని నగరం నడిబొడ్డున ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ నగరానికి వచ్చే దేశ,విదేశీ పర్యాకులు, బుద్ధిష్టులు, అంబేద్కర్ అనుయాయులు ఆకర్షించి ఈ విగ్రహాన్ని తప్పకుండా సందర్శించే అవకాశాలుంటాయని, ఆ ప్రాంతం ఒక పర్యాటక ప్రాంతంగా నిలిచే అవకాశాలున్నాయన్నారు. దళితబంధు పథకం దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అమలవుతోందని, ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధిలోకి తీసుకు రావడానికి యువతకు వృత్తినైపుణ్యత కోసం శిక్షన ఇప్పించడం వారిని ప్రోత్సహించడం జరుగుతోందనిఅన్నారు. ఒక ప్రణాళికబద్ధంగా దళితులను అన్నిరంగాల్లో అభివృద్ధిలో ముందుకు తీసుకురావడానికి సిఎం కెసిఆర్ చేస్తున్న కృషి అమోఘమని అన్నారు. రాష్ట్రం ఏర్పడినతర్వాత దళితుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని, దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేయడం, ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనారిటీవర్గాల వారికి అనేకమైన గురుకుల పాఠశాలలు, గురుకుల కళాశాలలు, గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయడం, ప్రతి జిల్లాల్లో ఎస్సీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయడం, ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పేద బడుగుబలహీనవర్గాల విద్యార్థినీ, విద్యార్థులను విద్యాపరంగా ఉద్యోగపరంగా అభివృద్ధిలోకి తీసుకురావడం జరిగిందన్నారు.



ముషీరాబాద్ చౌరస్తాలో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ కార్యక్రమంలో పాల్గొన్న టిఆర్ఎస్ నాయకులు పసుపులేటి శంకర్, శ్యామ్‌యాదవ్

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి, ఎమ్మెల్యే

కొంపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దూలపల్లి చౌరస్తా నుంచి బహదూర్‌పల్లి చౌరస్తా వరకు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న 100ఫీట్ల రోడ్డు వెడల్పు పనులకు సోమవారం మంత్రి మల్లారెడ్డి,ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద్, మైనంపల్లి హన్మంతరావు ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజా అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని ముందు చూపుతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రోడ్డు వెడల్పు పనులు చేపట్టామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని, అందులో భాగంగానే రూ. 25కోట్లతో 100ఫీట్ల రోడ్డు వెడల్పు పనులు, రూ. 2.88కోట్లతో ఆర్‌సీసీ పైపులైన్ పనులను ప్రారం భించామన్నారు. అనంతరం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి రూ.25కోట్ల నిధులను మంజూరు చే సిన పురపాలక మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎన్‌డీపీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో వరదనీటి సమస్య తలెత్తకుండా సుమారు రూ.4కోట్లతో దూలపల్లి కల్వర్టు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అపర్ణ ఫామ్ గ్రూప్స్‌లో సుమారు 10కాలనీలు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ కల్వర్టు అభివృద్ధి పనుల ద్వారా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంద న్నారు. సీఎం కేసీఆర్,మంత్రి కేటీఆర్‌ల కృషితో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. ఈ కార్య క్రమంలో ఛైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్‌ఛైర్మన్ గంగయ్య నాయక్, కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



భూమిపూజ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద్

# పన్ను వసూళ్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి పనులపై ఏది?

## గ్రేటర్‌లోనే ఎల్‌బినగర్ భేష్ - ముక్కు పిండి వసూలు చేస్తున్న పన్నులు

### మౌలిక వసతులపై స్పందించని అధికారులు



ఎల్‌బినగర్ సర్కిల్ కార్యాలయం

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** ఆస్తి పన్ను వసూళ్లపై శ్రద్ధ పెడుతున్న అధికారులు అభివృద్ధి పనులపై పెట్టడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ టార్గెట్లు పూర్తి చేసుకునేందుకు అహర్నిశలు దూకుడుగా వ్యవహరిస్తున్న అధికారులు అదేఉత్సాహంతో కాలనీవాసులు సమస్యలపై ఇస్తున్న ఫిర్యాదులపై స్పందించకపోవడం పట్ల కాలనీవాసులు అధికారుల తీరుపట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. సరూర్‌నగర్, ఎల్బీనగర్, హయత్ నగర్ సర్కిల్ పరిధిలో ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల ఆస్తిపన్ను వసూలు చేస్తున్న అధికారులు కాలనీలలో చాలా సంవత్సరాలుగా పేరుకుపోయిన సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో సరూర్ నగర్ సర్కిల్ పరిధిలో రూ.62 కోట్లు పన్ను వసూళ్ల చేయాల్సి ఉండగా రూ.60.91 కోట్లు వసూలు చేసి 98.24 శాతం లక్ష్యాన్ని సాధించారు. ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలో రూ.49 కోట్లు పన్ను వసూళ్ల లక్ష్యం కాగా రూ.50.26 కోట్లు వసూలు చేసి గ్రేటర్ హైదరాబాద్‌లోనే ముందంజలో ఈ సర్కిల్ నిలిచింది. అదేవిధంగా హయాత్‌నగర్ సర్కిల్ పరిధిలో రూ.62 కోట్ల రూపాయల ఆస్తి పన్ను వసూలు లక్ష్యంకాగా అందులో రూ.59.70 కోట్లు వసూలు చేసి 96.29 శాతం లక్ష్యంతో ముందున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే పన్నుల వసూళ్ల విషయంలో అధికారులు రికార్డులు బద్దలు కొడుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో పన్నులు కడుతున్న ప్రజలకు మాత్రం కాలనీలలోని మౌలిక వసతుల విషయంలో అధికారులు చొరవ చూపకపోవడం పలు విమర్శలకు దారి తీస్తోంది. చాలా కాలనీలలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య కాలనీవాసులను వెంటాడుతోంది. కొన్నికాలనీలలో రోడ్లు, మంచినీటి సమస్య, విద్యుత్ దీపాలు వెలగకపోవడం లాంటి సమస్యలు కాలనీవాసులను వెంటాడుతూనే ఉంది. సంక్షేమ సంఘం భవనాలు పార్కుల అభివృద్ధి తదితర సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముక్కు పిండి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నట్లుగానే స్థానిక సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## అర్.కె.పురం చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలని వినతి:ఎమ్మెల్యే మైనంపల్లి

**నేరేడ్‌మెట్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో చెరువుల సుందరీకరణ, చెరువులు పూడికతీత, దోమల నివారణ, గుర్రపు డెక్కతొలగింపు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, జోనల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డిలతో కలసి నియోజకవర్గ పరిధిలోని అర్.కె పురం, బండచెరువు, యాప్రాల్ నాగిరెడ్డి, అల్వాల్‌లోని పలు చెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని చెరువుల అభివృద్ధి, దోమల నివారణ, చెరువు చుట్టూ కంచె వేయాలని కోరుతూ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్‌ను కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీసి రాజు, ఈఈ లక్ష్మణ్, ప్రాజెక్టు సీఈ సురేష్, ఎఇ భాస్కర్, డీఇ పవన్, వాటర్ వర్క్స్ జీఎం సునీల్ కుమార్, ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఎస్సార్ ప్రసాద్, మహేష్, రాజు, పాపి, పిట్ల శ్రీనివాస్, మీడియా కన్వీనర్ గుండా నిరంజన్, రాందాస్ మోహన్ రెడ్డి, భాగ్యనంద్, బాబు, బాలక్రిష్ణ తదిరులు పాల్గొన్నారు.

## చిన్నారి వైద్యానికి మంత్రి చేయూత



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మంత్రి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** పేద కుటుంబానికి చెందిన ఓ చిన్నారి వైద్యానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఆపన్న హస్తం అందించారు. తీవ్ర అనారోగ్యానికి గురైన 18 నెలల బాలిక వైద్య చికిత్సల నిమిత్తం మంత్రి సిఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ.లక్ష మంజూరు చేయించారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ అంబేడ్కర్‌నగర్ నివాసి పేద కుటుంబానికి చెందిన లక్ష్మి కుమార్తె వ్యాధిబారిన పడడంతో చికిత్స ఖర్చులు భరించలేక కుటుంబ సభ్యులు కార్పొరేటర్ బైగళ్ళ బాలమణిని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆమె మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించి బాలిక వైద్యానికి రూ.లక్ష మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో మంజూరైన చెక్కును సోమవారం తల్లి లక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బాలమణి, అంబేద్కర్ కాలనీ అధ్యక్షుడు బైగళ్ళ ఓంప్రకాశ్, సహదేవ్, జంగయ్య, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## జనరిక్ ఔషధాలను ఆదరించాలి : కార్పొరేటర్ అనితారాణి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** జనరిక్ ఔషధాలను ఆదరించాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 21 డివిజన్ కార్పొరేటర్ బంగారు అనితారాణి ప్రభాకర్ పిలుపునిచ్చారు. బడంగ్‌పేట్‌లోని మెయిన్‌రోడ్డులోని న్యూ మాస్టర్‌మైండ్స్ జూనియర్ కాలేజీ సమీపంలో నూతనంగా ఏర్పాటైన జనరిక్ ఆనంద ఇ క్లినిక్, ఔషధాలయం సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ అనితారాణి ప్రభాకర్ వాటిని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్యం ఖరీదైన ఈ రోజుల్లో జనరిక్ ఔషధాలు పేద, మధ్యతరగతి ప్రజలకు వరంగా మారాయని అన్నారు. తక్కువ ఖర్చు అయ్యే జనరిక్ ఔషధాలను అవసరమైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బంగారు ప్రభాకర్, చిత్రం శ్రీనివాస్, కార్వాన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రినగర్ ఫేస్4లో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

**వనస్థలిపురం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** గాయత్రినగర్ ఫేస్4లో నెలకొన్న సమస్యలపై కాలనీ వాసులు సోమవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలను విన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సత్వరమే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. త్రి ఫేస్ కరెంటు, మంచినీటి పైప్ లైన్లు త్వరలోనే పూర్తి చేస్తామని హామీ నిచ్చారు. కాలనీ మహిళా సభ్యురాళ్లు ఎమ్మెల్యేను ఉద్దేశించి సమస్యల పట్ల చేసిన వీడియోని తిలకించి సమయం కుదిరినప్పుడు మార్నింగ్ వాక్‌కి వచ్చి చూస్తానని తెలిపారు. అనంతరం గాయత్రినగర్ ఫేస్ 4 నివాసుల సంక్షేమ అధ్యక్షుడు గౌరిశెట్టి మనోజ్ కుమార్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బిఎన్‌రెడ్డి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు.

## ప్రభుత్వ ఎస్టీ హాస్టల్‌లో వసతులు కల్పించాలని జనసేన ఆందోళన

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఎస్టీ హాస్టల్లో కనీస వసతులులేక విద్యార్థులు నానా ఇక్కట్లకు గురవుతున్నారని జనసేన పార్టీ సమన్వయకర్త పొన్నూరు శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. నాగోల్ ప్రభుత్వ ఎస్టి బాలుర వసతి గృహంలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాగోల్ చౌరస్తాలో జనసేన ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన భోజనం అందించడంలేదని పేద విద్యార్థుల వసతుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ హాస్టల్లో పరిస్థితి దుర్గ మారినప్పటికీ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదని ఆమె మండిపడ్డారు. రోడ్డుపై బైఠాయించిన జనసేన నాయకులతో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో చైతన్యపురి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నాయకులను ఆందోళన విరమించాలని చెప్పినప్పటికీ వినకపోవడంతో పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## సీ.ఎం.రిలీఫ్ ఫండ్‌తో నిరు పేదలకు లబ్ది : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సాయినాథ్‌కు ఎల్.ఓ.సీ.ఆందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**వనస్థలిపురం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** హస్తినపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీ కి చెందిన జయశ్రీ గుండెకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి ఆర్థికస్థితి బాగలేక వారి కుటుంబ సభ్యులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి వారి ఆపరేషన్‌కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయడం జరిగింది. ఇందుకుగాను వారికి రెండు లక్షల యాభై వేల రూపాయల ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరయ్యింది. మంజూరైన ఎల్ఓసిని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి సహాయనిధి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది తెలిపారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బారాస అధ్యక్షులు సత్యంచారి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కో హటావో..దేశ్‌కో బచావో : సిపిఐ శంకర్‌నాయక్

**సైదాబాద్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** బిజెపి కో హటావో..దేశ్‌కో బచావో నినాదంతో సిపిఐ నాయకులు శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాయమాటలతో గద్దెనెక్కిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతాల పేరిట, కులాల పేరిట దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తూ, ప్రశ్నించే కమ్యూనిస్టు నాయకులపై అక్రమ కేసులు పెడుతుందన్నారు. దేశ సంపద మొత్తం ఆదాని, అంబానిలకు దోచి పెడుతుందని ఆయన ఆరోపించారు. రోజు రోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ పేద ప్రజల నెత్తిన మోయలేని భారం పెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మహమూద్, అమీన, రాజు, దశరథ్, అజయ్, రేష్మ, అజీం తదితరులు పాల్గొన్నారు.

## కంప చెట్లను తొలగించాలని వినతి : కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** హయత్‌నగర్‌లోని ఆలిండియా రేడియో స్టేషన్ ఆవరణలో ఏపుగా పెరిగిన కంపచెట్ల కొమ్మలు సూర్యనగర్ వెళ్లేదారిలో పరుచుకుపోవడంతో అటుగావెళ్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వాటిని తొలగించాలని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి రేడియో స్టేసన్ అధికారులను కోరారు. సోమవారం ఆయన రేడియో స్టేషన్‌కు వెళ్లి అధికారులను కలిసి వారితో మాట్లాడారు. ఏపుగా పెరిగిన కంపచెట్ల కొమ్మలు ప్రహరీ మీదుగా రోడ్డుపైకి వస్తుండడంతో ద్విచక్ర వాహన దారుల కళ్లకి తాకుతున్నాయని, కార్లు, ఇతర వాహనాలకు తగలడంతో గీతలు పడుతున్నాయని తెలిపారు. వెంటనే వాటిని తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు భాస్కర్‌లాల్, ఏఈ నరేంద్రతేజ పాల్గొన్నారు.

## దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయి : ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్

**మలక్‌పేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని మలక్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మూసారాంబాగ్‌లోని ఆండాళ్ నిలయం సమీపంలో రిందా కృప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడానికి ఇటువంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను కొనియాడారు. స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించేవారికి తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. రిందా కృప నిర్వాహకులు రూపాదేవి, లక్ష్మీదేవి, రామకృష్ణలు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలనుండి మూసారాంబాగ్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మంచినీటిని అందిస్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా అండాల్ నిలయంలో నిత్యం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

## పెరిగిన ఇంటి పన్నులను తగ్గించాలని మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** ఇబ్బడిముబిగా పెరిగిన ఇంటి పన్నులను తగ్గించాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని న్యూ గాయత్రీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ బిఆర్ఎస్ ఉపాధ్యక్షుడు సిరూర్ బాలరాజ్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి ఒక వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పన్నులు విపరీతంగా పెరగడం వల్ల కాలనీ ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతున్నదని అన్నారు. అయితే కార్పొరేషన్ అధికారులు మాత్రం ఆస్తి పన్నులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని వారు మంత్రి దృష్టికి తెచ్చారు. కాలనీలో కొందరివైతే ఏకంగా నాలుగు రెట్లు పన్నులు పెరిగాయని వారు మంత్రికి వివరించారు. ఈ మేరకు విపరీతంగా ఉన్న ఇంటి పన్నులను తగ్గించాలని వారు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

## రూ. కోటి 50లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం : ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

**నాచారం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా రామంతాపూర్ డివిజన్‌లో వివిధ విభాగాల అధికారులతో కలిసి ఎమ్మెల్యే భేతిసుభాష్ రెడ్డి పాదయాత్ర నిర్వహించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివేక్‌నగర్‌లో రూ.1కోటి 50లక్షల వ్యయంతో బాక్స్ డ్రైనేజీ నిర్మాణం పనులకు స్థానిక కార్పోరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. డ్రైనేజీ, మంచినీరు. రోడ్డు, కమ్యూనిటీ హాల్, గ్రీనరీ, ఫెన్సింగ్, విద్యుత్ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసి అరుణకుమారి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నాగేందర్, డీఈ నాగమణి, శ్వేత, సానిటేషన్ అదికారి చందన, ప్రాజెక్టు ఆఫీసర్ రమాదేవి, జలమండలీ మేనేజర్ రవీందర్, ఏఈ రాములు, బీఆర్ఎస్ నాయకులు గరిక సుధాకర్, ఎం.డి ముస్తక్, నందికంటి శివ, మధు, జానకీ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయి : జక్కిడి ట్రస్ట్

**మన్సూరాబాద్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, టీపీసీసీ డెలిగేట్, ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జక్కిడి ప్రభాకర్ రెడ్డి తెలియజేశారు. నాగోల్‌చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ ప్రారంభించగా, మోహన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీనియర్ పాత్రికేయుడు మేకల సత్యనారాయణ ప్రారంభించారు. కొత్తపేట ఓమ్ని చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని స్థానిక మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్ ప్రారంభించగా, నాగార్జునసాగర్ ఎక్స్ రోడ్డు చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఐ ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ప్రారంభించగా, బైరామల్ గూడా అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని స్థానిక సీనియర్ నాయకుడు ప్రకాష్ గుప్తా, కామినేని చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సీనియర్ నాయకుడు పృథ్వీరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. చలివేంద్రాల వద్ద మంచి నీటిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకొని దా హార్తిని తీర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులతోపాటు, వివిధ రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎల్‌బినగర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కర్మన్‌ఘాట్ క్రాంతిక్లబ్ ఆవరణలోని కంటి వెలుగు కేంద్రాన్ని ఎమ్మెల్యే సోమవారం ఆకస్మికంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 19వ తేదీన కంటి వెలుగు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రారంభించడం జరిగిందని, పేదలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, కండ్ల జోడులు ఉచితంగా అందిస్తుందని, అవసరమైన వారికి సరోజనిదేవి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయడం జరుగుతుందన్నారు. క్రాంతి క్లబ్ ఆవరణలో జూన్ 15వ తేదీవరకు కంటి వెలుగు కేంద్రం ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగ ం చేసుకోవాలని ఎమ్మెల్ే య కోరారు.

## కర్మన్‌ఘాట్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని శ్రీలక్ష్మి కన్వెన్షన్‌లో నిర్వహించారు. సంఘం నూతన గౌరవ అధ్యక్షుడిగా బిళ్లకంటి కిరణ్ కుమార్ గుప్తా, అధ్యక్షులుగా అనంత రవికుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా ఆకుల రమాకాంత్ గుప్తా, కోశాధికారిగా లింగేష్‌గుప్తా, కార్యనిర్వాహక కార్యదర్శిగా పద్మనారాయణ గుప్తాలు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, తెలంగాణా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు గుడి, బడితో పాటు అన్నదానాలు చేయడంలో ముందుంటారని అన్నారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మహాసభ సభ్యత్వం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంగమేశ్వర్ గుప్తా, ఆలంపల్లి శ్రీనివాస్, రేణిగుంట గణేష్ గుప్తా, ఊరె లక్ష్మణ్, పసునూరి శ్రీనివాస్, తాడెపల్లి వెంకటేష్ గుప్తా, నాగబండి నగేష్ గుప్తా, బచ్చు మహేష్ గుప్తా, ఉప్పల శ్రవణ్ కుమార్ గుప్తా, సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## నూతన పైపు లైన్ల నిర్మాణం: కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో కలుషిత నీటి సరఫరా జరుగకుండా తగినచర్యలు చేపట్టాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఎస్‌బిహెచ్ కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో అవసరమైన చోట నూతన పైపులైన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రవికుమార్, జ్యోతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా అన్నపూర్ణ

**మలక్‌పేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన అన్నపూర్ణ రెండవసారి నియమితులయ్యారు. ఈ మేరకు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ప్రకటించారు. ఈ సందర్భంగా మలక్‌పేటలో అన్నపూర్ణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పటిష్టతకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలను కలుపుకుంటూ పార్టీని మరింత అభివృద్ధి చేయడానికి తోడ్పడతామన్నారు. టిడిపితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంకోసం తెలుగుదేశం పార్టీ ఎంతో కృషి చేసిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.

## మౌలాలి డివిజన్ పరిధిలో అభివృద్ధి పనుల శంకుస్థాపన : ఎమ్మెల్యే మైనంపల్లి



అభివృద్ధి పనుల శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**మల్కాజిగిరి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** మౌలాలి డివిజన్ పరిధిలో రెండు కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు, అదే విధంగా ఆఫీసర్స్ కాలని, లక్ష్మి నగర్, క్రియేటివ్ నగర్, గాయత్రీ నగర్, అండల్ నగర్, జోహార్ నగర్, షఫీ నగర్, హనుమాన్‌నగర్ శంకరయ్యకాలని ఏరియాలలో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్దే తన లక్ష్యమని నియోజకవర్గంలోని ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి కాలనీలలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కాలనీవాసులు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, ఈఈ లక్ష్మణ్, డిఈ మహేష్, ఎఈ మధురిమా, అమినుద్దీన్, నీల సతీష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, భాగ్యనంద్‌రావు, సత్తయ్య, మంద భాస్కర్, ఆదినారాయణ, ఇబ్రహీం, మోహన్‌రెడ్డి, సంతోష్, రాందాస్, గౌలికర్ దినేష్, షకిల్, గౌలికర్ శైలెందర్, దుర్గేష్, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయులు వేసిన పునాదులతోనే అందరికి సంక్షేమ ఫలాలు : డా. కమల

**నాచారం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** మహనీయులు వేసిన పునాదులతోనే నేడు అందరికి సంక్షేమఫలాలు అందుతున్నాయని నాచారం ఇఎస్ఐ మెడికల్ సూపరెండెంట్ డా.కమల పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఇఎస్ఐ రాష్ట్ర అధ్యక్షులు డా.చీమ శ్రీనివాస్, ఆర్ఎంఒ డా.రజ్యత్‌ల ఆధ్వర్యంలో సోమవారం ఆసుపత్రి హాల్‌లో మహనీయులు, బాబుజగ్జీవన్ రాం, జ్యూతిబాపులే, అంబేద్కర్ జయంతి వేడుకల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరెండెంట్ డా. కమలతో పాటు పలువురు వైద్యులు వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. కమల మాట్లాడుతూ మహనీయుల ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, హాస్పిటల్ అభివృద్ధి కోసం అందరు కష్టపడి పనిచేయాలని పేర్కొన్నారు. అనంతరం అధ్యక్షులు డా. చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భారీ అంబేద్కర్ విగ్రహం పెట్టడం, సచివాలయానికి అంబేద్కర్ నామకరం చేసినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమేష్, వెంకటేష్ బాబు, వెంకట్‌రెడ్డి, రవి,ప్రశాంతి, గంగాశంకర్, సి.రవి, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వేణు, ధన్‌రామ్, ఐఎన్‌టీయూసీ నాయకులు చారితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఇల్లు లేని రెండు పేద కుటుంబాలకు స్థలాల పంపిణీ : కొత్త మనోహర్‌రెడ్డి



ఇంటి స్థలం డాక్యుమెంట్లను అందజేస్తున్న కొత్త మనోహర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడకు చెందిన ఇల్లు లేని రెండు పేద కుటుంబాలకు కెఎంఆర్ ట్రస్ట్ చైర్మన్, మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొత్త మనోహర్‌రెడ్డి 60 గజాల చొప్పున ఇంటి స్థలాలను పంపిణీ చేశారు. స్థానికులైన ఎ.ప్రవీణ, పి.మీనలకు ఆయన ఆమన్‌గల్ ప్రాంతంలోని తన స్వంత భూమి నుండి 60 గజాల చొప్పున ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించి సోమవారం డాక్యుమెంట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఊపిరి ఉన్నంత వరకు పేదలకు సాయం చేస్తుంటానని స్పష్టం చేశారు. కాగా ఇంటి స్థలాల డాక్యుమెంట్లు తీసుకున్న ప్రవీణ, లక్ష్మిలు మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## కొత్తపేట డివిజన్‌లోని కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి : కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** కొత్తపేట డివిజన్ సత్యనగర్‌కాలనీ, ఎస్ఆర్ఎల్‌కాలనీవాసులతో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఇంటెన్సివ్ శానిటేషన్, ఆర్డబ్ల్యూఏ ఇంట్రాక్షన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ సమావేశంలో పాల్గొని కాలనీలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు, డ్రైనేజ్ శానిటైజేషన్, దోమలు, మంచినీరు తదితర స్థానిక సమస్యలను గురించి కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా జిహెచ్ఎంసి, జలమండలి అధికారులు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ మాతృనాయక్, సానిటైజేషన్ ఇన్స్పెక్టర్ బుచ్చయ్య, వాటర్‌వర్క్స్ అధికారులు అరీఫ్, సత్యనారాయణ, రాంకి అధికారులు విజయభారతి, లక్ష్మయ్య, సత్యనగర్‌కాలనీ అధ్యక్షుడు శుక్ల, సెక్రెటరీ రమణ, ఎస్ఆర్ఎల్‌కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌కుమార్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జవహర్‌నగర్‌లో జీవో 58 ద్వారా 40 మందికి పట్టాల పంపిణీ

**జవహర్‌నగర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** టిఆర్ఎస్ ప్రభుత్వ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని జవహర్‌నగర్ మున్సిపల్ డిప్యూటీ చైర్మన్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలో జీవో నెం 58ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి 48మందికి పట్టాను పంపిణీ చేసారు. అనంతరం అయన మాట్లాడుతూ పేద ప్రజలకు టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. నిరంతరం పేద ప్రజల కోసం ఆలోచించే ప్రభుత్వం కేవలం టిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో రంగ శ్రీమన్నారాయణ, వెంకటేష్, మూర్తి, లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఐఐటి ఒలంపియాడ్ పరీక్షలలో సత్తా చాటిన లార్డ్స్ విద్యార్థులు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** ఈ అభ్యాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఐటి ఒలంపియాడ్ పరీక్షల్లో బాలాపూర్ మండలానికి చెందిన జిల్లెలగూడ లార్డ్స్ హై స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ పరీక్షలో పాఠశాలకు చెందిన 73మంది విద్యార్థుల్లో 43మంది అత్యుత్తమ ప్రతిభ కనబరచి స్టేట్ ర్యాంకులు సాధించారు. ఈ నేపథ్యంలో రవీంద్రభారతిలో జరిగిన ఈ అభ్యాస్ అభ్యాతోత్సవంలో ముఖ్య అతిథులుగా విచ్చే సిన శాంత బయోటెక్నిక్ అధినేత పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ వర ప్రసాద్, లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు, డాక్టర్ జయప్రకాశ్ నారాయణల చేతుల మీదుగా లార్డ్స్ స్కూల్ విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. కాగా ఐఐటి ఒలంపియాడ్ పరీక్షల్లో అవార్డులు సాధించిన విద్యార్థులను లార్డ్స్ విద్యా సంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్‌లు అభినందించారు.